ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు

● ఉమ్మడి కడప జిల్లాలో 646 మందికి కౌన్సెలింగ్



హాజరైన మహిళా పోలీసు కార్యదర్శులు

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి కడప జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్‌కు మొత్తం 646 మంది బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులతో ఎస్పీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ర్యాంకింగ్ ప్రకారం పిలిచి పారదర్శకంగా గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీలు చేపట్టామన్నారు. దివ్యాంగులు, మెడికల్, స్పౌజ్, జనరల్ తదితరులను వారి సమస్యల ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుని వైద్యుల పర్యవేక్షణలో నిజనిర్ధారణ చేసుకుని పారదర్శకంగా బదిలీలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, డీపీవో ఏవో జ్యోతి, సూపరింటెండెంట్లు శ్రీనివాసనాయక్, సురేశ్, క్లర్కులు ఏ8 అగస్టీన్, ఏ10 గురప్ప, ఐటీ కోర్ టీం కానిస్టేబుల్ విశ్వనాథ్, డీపీవో సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్‌కు సర్వం సిద్ధం

● 1040 మందికి సీట్లు

వేంపల్లె, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. ఇన్‌చార్జి చాన్సెలర్ మధుమూర్తి, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సండ్రా పర్యవేక్షణలో ఇడుపులపాయలో 1040 మందికి, నూజివీడు ట్రిపుల్‌ఐటీలో 1060 మందికి సోమ, మంగళవారాల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇడుపులపాయకు సంబంధించి డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ పెనుగొండ రవి ఆధ్వర్యంలో లైబ్రరీలో ఏర్పాట్లు చేశారు. కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు.

ప్రశాంతంగా వెల్ఫేర్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని వెల్ఫేర్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వివిధ సచివాలయాల్లో స్థానికంగా ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న 392 మందికి స్థానచలనం కల్పించారు. ఉదయం నుంచి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీడీ సరస్వతి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తలెత్తకుండా నిరంతరాయంగా వీడియో కవరేజ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు


తగ్గేదేలే..?

● ఆగని వైసీపీ అక్రమాలు ● గతంలో 'గండికోట' లోనూ జోక్యం
● ఉద్దిమడుగు పరిహారంలోనూ కొట్టేసేందుకు యత్నం
● జగన్ అండ్ కో అనుచరులకు రూ.45 కోట్లు చెల్లించేందుకు స్కెచ్
● కీ రోల్ పోషించిన నెల్లూరు దళారీ

ఐదేళ్ల జగన్ పాలన అరాచక విస్ఫోటనం అని చెప్పవచ్చు. రూల్స్ గీల్స్ జాన్‌తా నై. వైసీపీ నేతలకు కావాల్సింది, కేడరుకు చేయాల్సింది పట్టుబట్టి చేయించుకున్నారు. అప్పట్లో అధికారులు కూడా జీహుజూర్ అంటూ వన్‌సైడ్‌గా వ్యవహరించారు. ఎలాగంటే.. గండికోట ముంపువాసుల పరిహారంలోనూ పులివెందుల బ్యాచ్‌కు అవకాశమిచ్చారంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఎన్నెన్నో విచిత్రాలు జగన్ అండ్ కో హయాంలో జరిగాయి. గత సర్కారు చేసిన డ్యామేజీపై చంద్రబాబు సర్కార్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో సిద్దవటం మండలంలోని ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిహారంలో వైసీపీ అండ్‌కో గ్యాంగ్ బినామీ పేర్లతో సుమారు రూ.45 కోట్లు కొట్టేసేందుకు పక్కాప్రణాళికతో స్కెచ్ వేశారు. ఈ వ్యవహారంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ దళారీ కీ రోల్ పోషించాడు. ప్రస్తుతం జిల్లాలో ఇప్పుడు ఇది హాట్ టాపిక్‌గా మారింది.

(కడప-ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పెద్దపల్లె పంచాయతీ జోగులపల్లెలో ఉద్దిమడుగు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 1988 డిసెంబరు 14న శంకుస్థాపన కూడా చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా బీడు భూములకు సాగునీరందించి సస్యశ్యామలం చేయాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఇందుకు సంబంధించి భూమి నిర్వాసితులకు గత ప్రభుత్వాలు పరిహారం చెల్లిస్తూ వచ్చాయి. ఈ భూముల వ్యవహారంలో వైసీపీకి చెందిన కీలక నేతలు, జిల్లా పరిషత్‌కు చెందిన ఓ వైస్ చైర్మన్ తన కుటుంబీకుల పేరుతో బినామీ పేర్లతో పరిహారం పొందారనే ఆరోపణలున్నాయి. ఉద్దిమడుగు ప్రాజెక్టు భూసేకరణను ప్రభుత్వం ఐదు రీచ్‌లుగా విభజించింది. అయితే ఇక్కడ ఉద్దిమడుగు నిర్వాసితుల పేరిట పరిహారాన్ని కాజేయాలని వైసీపీ నేతలు కన్నేశారు. ఇందులో భాగంగానే జడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన వారితో పాటు మరికొంతమంది వైసీపీ నేతలు కన్నేసి అటవీశాఖ భూములను రెవెన్యూ అధికారులతో దర్జాగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకొని పరిహారం కొట్టేశారంటారు. కాగా 2021లో పరిహారం పేరిట రూ.35 కోట్లకు పైగా కాజేయగా, ఇప్పుడు మరలా పరిహారం పేరిట రూ.45 కోట్లకు స్కెచ్ వేయడం దుమారం రేపుతోంది. ఇక్కడి జాబితాలో అంతా వైసీపీ అనుచరులుండడం గమనార్హం. భూములు పోయిన బాధితులకు ఇంత వరకు పరిహారం దక్కకపోగా.. బినామీలకు మాత్రం భూములు వచ్చినట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన ఓ దళారీ ద్వారా 2024 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవాలని భారీ ప్రచారం చేసిన ఓ మాజీ వైస్ చైర్మన్ బినామీలే ఆ జాబితాలో ఉండడం విశేషం. ఈ విషయమై అసలు బాధితులు మూడు రోజుల కిందట స్పెషల్ కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు దీనిపై ఆరా తీస్తున్నారు.

ముంపుపరిహారం కొట్టేయడంలో అక్రమాలకు దిక్సూచిగా సోమశిల ప్రాజెక్టును చెప్పవచ్చు. రామోజీ ఫిలింసిటీలో సినిమా సెట్టింగును తలపించే విధంగా ఇక్కడ పరిహారం కోసం జిల్లాలో ఎక్కడైనా పాడుబడ్డ పాత ఇళ్లల్లో ఉన్న టేకు ఇతర విలువైన కలపను కొనుగోలు చేసి గుడారాలు వేసి తద్వారా లబ్ధి పొందారు. అప్పట్లో అది సంచలనంగా మారింది. ఇప్పుడు ఇదే స్క్రిఫ్ట్‌ను ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిహారంలోనూ అమలు చేస్తుండడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.





పిచ్చిమొక్కల మధ్య ఉన్న శిలాఫలకం

బాలింత మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతోనే అంటూ బంధువుల ఆగ్రహం



మృతి చెందిన పెంచలమ్మ (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అధిక రక్తస్రావంతో ఓ బాలింత మృతి చెందిన సంఘటన బద్వేలు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. బద్వేలు మండల పరిధిలోని గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన పామూరి శ్రీనివాసులు సతీమణి పెంచలమ్మ (26) ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్దే పండంటి పాపకు జన్మనిచ్చింది. ఈమెకు ఇది మూడవ కాన్పు. అయితే డెలివరీ అనంతరం రక్తస్రావం అధికం కావడంతో దగ్గరలో ఉన్న ఏఎన్‌ఎంను సంప్రదించారు. ఏఎన్‌ఎం సూచనల మేరకు బాలింతను తొట్టిగారిపల్లె పీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న నర్సును సంప్రదించగా ఆమె డాక్టర్ వినయ్‌కుమార్‌కు ఫోన్ చేసి డాక్టర్ సూచనలతో వైద్యం అందించినట్లు బాధితులు తెలిపారు. ఎంతసేపటికి రక్తస్రావం ఆగకపోవడంతో బాధితులు అక్కడే ఉన్న నర్సును ప్రశ్నించగా ఆమె నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో



వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందంటూ ఆరోపిస్తున్న బంధువులు

తాము హుటాహుటిన బద్వేలు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, అప్పటికే పెంచలమ్మ కోమాలోకి వెళ్లిపోయిందని బాధితులు ఆరోపిస్తున్నారు. అక్కడి నుంచి బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారని చెబుతున్నారు. తమకు ముందే చెప్పి ఉంటే ఎక్కడికైనా తీసుకెళ్లే వారమని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆరోపిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని వసతులతో వైద్యం అందిస్తున్నామంటూ అధికారులు చెబుతున్నారే కానీ అది ఆచరణలో లేదని విమర్శిస్తున్నారు. ఎంతో ఆరోగ్యంగా ఉండి ఇంటి వద్దే ప్రసవించిందని, వైద్యుల చేతగానితనంతోనే ఇలా జరిగిందని,

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఈ ఘటనపై తొట్టిగారిపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యుడు వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. తాను ఫోన్‌లోనే స్టాఫ్ నర్సుకు ట్రీట్‌మెంటు గురించి చెప్పానని, అధిక రక్తస్రావం అవుతూనే ఉండటంతో వారు వెళ్లిపోయారని ఆయన తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం!

● ఏజెంటు ఇంటి వద్ద బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్

వివరాలు... 7లో

వివాహిత అనుమానాస్పద మృతి

● భర్తే హత్య చేశాడు : తల్లిదండ్రులు
● రాయచోటి ఆర్డీవో, డీఎస్పీ విచారణ
● బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



పోలీస్ సెటిల్‌మెంట్లపై
సీఎం సీరియస్

● ఏం జరిగిందో కనుక్కోవాలని విచారణకు ఆదేశం
● సొంత పార్టీ నేతలపై ఆరా

కడప, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏడాదిగా పాలన సాగుతోంది. గత ఎన్నికల్లో కూడా కడప పార్లమెంటులో ఐదు సీట్లను ఓటర్లు కూటమి నేతలకు కట్టబెట్టారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉన్నా.. పులివెందులలో మాత్రం జగన్ పార్టీనే అధికారంలో ఉన్నట్లు ఇద్దరు, ముగ్గురు పోలీసులు వ్యవహరిస్తున్నారు. కాగా ఈ మధ్య బెంగుళూరుకు చెందిన ఓ వ్యవహారంలో సెటిల్‌మెంట్ చేయడం తీవ్ర సంచలనం రేపింది. జగన్‌కు అత్యంత సన్నిహితులైన దుశ్యంత్‌రెడ్డి విషయంలో పులివెందుల సాక్షిగా సెటిల్‌మెంట్ చేశారు. ఇది పెద్ద దుమారం రేపింది. ఇదే విషయమై "పులివెందులలో వైసీపీ పోలీసులు" అనే కథనం ఆదివారం ఆంధ్రజ్యోతి మెయిన్ సంచికలో వెలువడింది. ఈ కథనంపై సీఎం చంద్రబాబునాయుడు సీరియస్ అయినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు సహించేది లేదని, దీనిపై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. సొంత పార్టీ నేతలపైనా విచారణకు ఆదేశించడంతో పార్టీ నేతల్లో ఆందోళన రేగుతోంది.

నేడు సభాభవన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం

కడప కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అదేవిధంగా సోమవారం ఉదయం 9-30 నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతోందని, 10 గంటల నుంచి పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించవచ్చన్నారు. గ్రామ, మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ఆ ప్రాంత సమస్యలపై అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చని డీఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేశారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు వివిధ ప్రాంతాల నుంచి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పిచ్చికుక్క స్వైర విహారం

● ముగ్గురు చిన్నారులపై విచక్షణారహితంగా దాడి




పిచ్చి కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

బద్వేలుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో పిచ్చికుక్క స్వైరవిహారంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత పదిరోజుల కిందటే ఓ పిచ్చికుక్క స్వైర విహారంతో ఏకంగా 50 మందిపై దాడి చేసి గాయపరిచిన ఘటనను ఇంకా మరవకముందే మరో పిచ్చికుక్క పట్టణంలోని అబ్బరాతి వీధిలో స్వైర విహారం చేసి ముగ్గురు చిన్నారులను విచక్షణారహితంగా దాడి చేసింది. వారు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా పిచ్చికుక్కలు ఇలా స్వైరవిహారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇంటి వద్ద చిన్నపిల్లలు స్వేచ్ఛగా ఆడుకునే వీలులేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కుక్కలను పట్టణం నుంచి తరలించాలని కోరుతున్నారు.

ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

● రాత్రి 8 గంటల వరకు కొనసాగింపు
● వీహెచ్, ఓహెచ్, ఆర్థో, స్పౌస్, మెడికల్ గ్రౌండ్స్ వారికి ప్రాధాన్యత
● పింఛన్ల పంపిణీ తరువాత ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్లు



డీపీఆర్‌సీ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్ల బదిలీ దరఖాస్తులను పరిశీలిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి, ఏవో ఖాదర్‌బాషా

కడప రూరల్, జులై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలు, జిల్లా పంచాయతీశాఖ, వ్యవసాయశాఖ, ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. ఆయా శాఖల అధికారులు రెండు రోజుల పాటు శని, ఆదివారం ఉద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పంచాయతీశాఖ పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్లకు (గ్రేడ్-6 పంచాయతీ సెక్రటరీ)లకు ఆదివారం ఉదయం పది గంటల నుంచి డీపీఆర్‌సీలో కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. డీపీవో రాజ్యలక్ష్మి, పరిపాలనాధికారి సయ్యద్ ఖాదర్‌బాషాల బృందం 274 డిజిటల్ అసిస్టెంట్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీహెచ్, ఓహెచ్, ఆర్థో, స్పౌస్, మెడికల్ గ్రౌండ్స్ వారికి మొదటగా కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. వారికి కౌన్సెలింగ్ కార్యాలయంలో ప్రత్యేక వసతులను కల్పించారు. దాదాపు 20 మందికి పైగా మహిళా ఉద్యోగులు చంటిబిడ్డలతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరి తరువాత మిగిలిన వారికి కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఒకేచోట 5 ఏళ్లు పూర్తి చేసిన వారి దరఖాస్తులు 274, రిక్వెస్ట్ బదిలీల దరఖాస్తులు 40 మొత్తం 314 దరఖాస్తులు ఉండడంతో సాయంత్రం 6 గంటలకు 110దరఖాస్తుల పరిశీలన మాత్రమే జరిగింది. మిగిలిన దరఖాస్తుల పరిశీలన రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. అలాగే శనివారం తప్పనిసరి బదిలీలతో పాటు, రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించిన 212 మంది గ్రేడ్-5 పంచాయతీ సెక్రటరీలకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఇలా జిల్లా పంచాయతీశాఖలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 526 మంది దరఖాస్తులను పరిశీలించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న 377 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు, జిల్లా వ్యవసాయశాఖలో పనిచేస్తున్న 175 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శనివారం కౌన్సెలింగ్‌ను ప్రారంభించి ఆదివారం నాటికి పూర్తి చేశారు.

పింఛన్ల పంపిణీ తర్వాత పోస్టింగ్ ఆర్డర్లు

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా పంచాయతీశాఖ, ఇంజనీరింగ్‌శాఖ, వ్యవసాయశాఖల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మొత్తం 1078 ఉద్యోగులకు బదిలీల కొరకు కౌన్సెలింగ్‌ను నిర్వహించి సీనియారిటీ ప్రకారం బదిలీ స్థానాన్ని నిర్ధారించారు. అయితే జూలై 1నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్లను ఇవ్వనున్నట్లు డీపీవో రాజ్యలక్ష్మి తెలిపారు.

ముగ్గురు అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

● రూ.25 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం



పోలీసుల అదుపులో దొంగలు, బంగారు నగలు

నందలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు దొంగలను పట్టుకుని వారి నుంచి 250 గ్రాముల బంగారం (వీటి విలువ సుమారు 25 లక్షలు)తో పాటు 14 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి పారిపోతున్న ఆవుల సంజయ్య, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి 250 గ్రాముల బంగారం, 14 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట గ్రామానికి చెందిన వారని, వీరిపైన నందలూరులో 2 కేసులు, వేంపల్లె, పులివెందుల, అనంతపురం మూడో టౌన్, ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల వన్‌టౌన్‌లలో కేసులు నమోదయ్యాయని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లాల దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని
హోంగార్డుకు గాయాలు


చికిత్స పొందుతున్న ప్రతాప్ రెడ్డి

కలికిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు బైక్ నడుపుతూ హోంగార్డును ఢీకొన్నాడు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషను ముందు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహ్మద్ ఫజారుద్దీన్ అనే బాలుడు మోటారు బైకుతో వేగంగా వచ్చాడు. హోంగార్డు చింతల ప్రతాప్ రెడ్డి ఆ బాలుడిని అటకాయించేందుకు ప్రయత్నించగా, మరింత వేగంగా వెళ్లిన బాలుడు నేరుగా హోంగార్డును ఢీకొట్టాడు. దీంతో అతని కాలు విరిగింది. దీంతో బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని, ఖాదర్‌హుసేన్ గుట్ట పాలెంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న అతని తండ్రి ఖాదర్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువురి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. గాయపడిన హోంగార్డును ఆసుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు. పులివెందులకు చెందిన ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తన ఆటోలో తొండూరు మండలంలోని కృష్ణంగారిపల్లె నుంచి పులివెందులకు వస్తూ పట్టణ సమీపంలో చిత్తుకాగితాలు ఏరుకునే ఓ గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో బోల్తా పడింది మృతుడికి 55 నుంచి 60 ఏళ్ల వయసుంటుందని, ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళకు చేయి విరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసునమోదు చేసినట్లు వివరించారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య


చికిత్స పొందుతున్న సుమన్

ఖాజీపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు కథనం మేరకు మండల పరిధిలోని చెర్లోపల్లెకు చెందిన దిగినేని సుమన్ (18) కొద్దిరోజులుగా అనారోగ్యంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స చేయించుకొనేవాడు. ఆదివారం ఉదయం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గజ్జిగానిపల్లెకు చెందిన వినోద్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

యువకుడి అదృశ్యం


అదృశ్యమైన రామచంద్ర

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిన్న చౌకు రెడ్డికాలనీకి చెందిన దాక్లా ఉదయ రామచంద్ర (19) అనే యువకుడు ఈ నెల 27న అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ తెలిపారు. కడప నగరంలోని గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసిన రామచంద్ర వేసవి సెలవుల్లో తన తల్లిదండ్రులకు పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. పదిరోజుల నుంచి దిగులుగా ఉండడంతో తల్లిదండ్రులు కారణం అడిగినా సమాధానం చెప్పలేదు. ఈ నెల 27 మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి సుబ్బరామయ్య చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీసు ఇన్‌స్పెక్టర్ సెల్ నెం.9121100520, ఎస్ఐ సెల్ నెం.9121100521, 9121100522లకు ఫోను చేసి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

జూద కేంద్రాలపై దాడులు.. పది మంది అరెస్టు

● రూ.20,470 నగదు స్వాధీనం

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న జూద కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు ఈ జూద కేంద్రాలపై దాడులు చేశారు. అక్కడ జూదమాడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.20, 470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

భూమిని ఆక్రమించారు.. న్యాయం చేయండి

● అధికారులకు బాధితుడి వినతి


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు ఈశ్వర్‌రెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణబారి నుంచి తమ భూమిని కాపాడాలని చింత కొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరు తున్నాడు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాడు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెలోని సర్వేనెంబర్ 54/1సిలో 27 సెంట్లు, 54/2సిలో 50 సెంట్లు చొప్పున 77 సెంట్ల భూమిని 20 ఏళ్ల క్రితం కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించగా, ఆ భూమిని కాకుండా, రోడ్డుకు ఆనుకుని ఉన్న తమ భూమిని ఆ వ్యక్తి ఆక్రమించుకుని చదును చేసుకున్నాడని తెలిపారు. గత నెలలో ఈ విషయం పై ఎస్పీకి వినతిపత్రం అందజేయగా, ఆయన సి.కె.దిన్నె పోలీసులకు రెఫర్ చేశారన్నారు. అయితే, పోలీసులు ఆక్ర మణ దారుడికే వత్తాసు పలుకుతూ తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం. జిల్లా అధికారులు మానవత్వంతో స్పందించి సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరాడ. సమావేశంలో బి. మల్లికార్జునరెడ్డి, వీరమ్మ, నాగమునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వర్కర్ల ఆకలి కేకలు

● 10 నెలలుగా అందని వేతనాలు ● కలెక్టర్ ఒప్పుకోలేదని అధికారుల మెలిక ● కలెక్టర్‌కు పీలేరు ఎమ్మెల్యే లేఖ


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పీలేరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు సుమారు ఎనిమిదేళ్ల క్రితం పీలేరులో 26 వాటర్ ప్యూరిఫైయింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉచితంగా ప్రతి ఇంటికీ రోజుకు రెండు క్యాన్ల చొప్పున తాగునీరు అందిస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమైనా ఈ ప్లాంట్లు మాత్రం విజయవంతంగా ప్రజలకు తాగునీరు అందించాయి. ఈ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు 26 మంది వర్కర్లను నియమించారు. వీరిలో 11 మందికి పీలేరు గ్రామ పంచాయతీ నిధుల నుంచి, మిగిలిన 15 మందికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.7,200 చొప్పున వేతనాలు చెల్లించేవారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నేతలు వైసీపీ హయాంలో నియమించిన వర్కర్లను తొలగించి, కొత్తవారిని నియమిం చారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు చొప్పున మొదటి మూడు నెలలు వేతనాలు చెల్లించారు. ఈ నేపథ్యంలో పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో వైసీపీ హయాంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఈ ఆరోపణలపై విచారణ నిర్వహించి సుమారు రూ. 1.50 కోట్లు పక్కదారి పట్టినట్లు తేల్చింది. దీంతో పీలేరు సర్పంచ్ ఎస్.హబీబ్ బాషా, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ సఫీ చెక్‌పవర్ రద్దు చేశారు. గతంలో ఇక్కడ ఈవోలుగా పనిచేసిన ముగ్గురు సస్పెన్షన్‌కు గురయ్యారు. కలెక్టర్, డీపీవో అనుమతి లేకుండానే వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించడం నిధుల దుర్వినియోగంగా ఈ కమిటీ భావించి, వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లకు వేతనాల చెల్లింపు ఆపేశారు. దీంతో వారికి వేతనాలు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీ పాలక వర్గం కలెక్టర్‌కు విన్నవించుకుంది. అయితే పంచాయతీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వడం కుదరదని, వాటర్ ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఆపరేటర్ జీతాలు, ఇతర అవసరాల కోసం వాటర్‌క్యాన్లకు ప్రజల నుంచి కనీస రుసుము వసూలు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


యర్రరెడ్డి గుట్ట వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

సమస్య పరిష్కారానికి నేతల యత్నం

జీతాలు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న వర్కర్లు ప్లాంట్ల నిర్వహణపై అనాసక్తి చూపుతున్నారు. ఇంకెంత కాలం ఇలా వెట్టిచాకిరీ చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 26 మినరల్ ప్లాంట్లలో నీరు ఉచితంగా ఇవ్వగా, ఇప్పుడు ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని అధికార పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఎలాగైనా పెండింగ్ జీతాలు ఇప్పించి సమస్య పరిష్కరించాలని యత్నిస్తున్నారు.

పెండింగ్ జీతాలపై ఆరా....

స్థానిక పంచాయతీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం పీలేరు అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీతాల పెండింగ్ విషయం కమిటీ చర్చించింది. ఏదో విధంగా జీతాలు చెల్లించాలని, అనంతరం వాటర్ ప్లాంట్ల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని నిర్ణయం తీసుకుంది. ఇక ఎంతో కాలం వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కమిటీ నిర్ణయించినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ...



వాటర్ ప్లాంట్ల వద్ద పనిచేస్తున్న 26 మంది వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను కలెక్టర్‌కు పంపించాం. ఆయన తీసుకొనే నిర్ణయంపై జీతాల చెల్లింపు ఆధారపడి ఉంటుంది

- లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం!

● ఏజెంటు ఇంటి వద్ద బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా కళాశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కడప చౌటుపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న రవి అలియాస్ రఫి అనే వ్యక్తి నిరుద్యోగులకు ఆశ కల్పించాడు. ఉద్యోగం కావాలంటే రూ.6.50 లక్షలు చెల్లించాలని చెప్పాడు. దీంతో జిల్లా వ్యాప్తంగా 21 మంది డబ్బు చెల్లించడంతో వారందరికీ నియామక పత్రాలు సైతం ఇప్పించాడు. అయితే ఈ నియామకాలు చెల్లవంటూ అధికారులు చెప్పడంతో తమ వద్ద డబ్బులు తీసుకున్న రఫీని వారు ప్రశ్నించగా, తాను కూడా గుంటూరుకు చెందిన వల్లి అనే వ్యక్తికి ఇచ్చానని అడ్డం తిరిగాడు.. దీంతో బాధితులు కొద్ది రోజుల క్రితం జమ్మలమడుగు రాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు రవి అలియాస్ రఫీపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, ఆదివారం బాధితులు ఏజెంటు రవి ఇంటి వద్ద ఆందోళన చేస్తుండగా తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, రఫిపై కేసు కూడా నమోదు చేశామని, అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆందోళన విరమించాలని చెప్పడంతో బాధితులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తే హత్య చేశాడు: తల్లిదండ్రులు
● రాయచోటి ఆర్డీవో, డీఎస్పీ విచారణ
● బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


హిందూజా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ (ఇన్‌సెట్) భర్త విజయశేఖర్ రెడ్డితో హిందూజా(ఫైల్)

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆదివారం మృతి చెందగా, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని, భర్తే హత్య చేశాడంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీలేరు పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెకు చెందిన విజయశేఖర రెడ్డి(39)కి చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన జీవనజ్యోతి, లోకనాథరెడ్డి దంపతుల కుమార్తె హిందూజా(29)తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి చార్విష్ రెడ్డి(04), రుషిక(02) అనే ఇద్దరు పిల్లలున్నారు. హిందూజా మృతి చెందిందంటూ ఆదివారం ఉదయం 3 గంటల సమయంలో విజయశేఖర రెడ్డి ఆమె బంధువులకు సమాచారం అందించాడు. గుండెపోటుతో చనిపోయిందని కొందరికి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఇంకొందరికి, చెరువులో దూకేసిందని మరికొందరికి చెప్పడంతో వారంతా ఆదివారం ఉదయానికి బందార్లపల్లెకు చేరుకున్నారు. విజయశేఖర రెడ్డి వివాహేతర సంబంధాల కారణంగా గతంలో భార్యభర్తల మధ్య గొడవలు, పంచాయతీలు జరిగి ఉండడంతో హిందూజా మరణంపై వారు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ లోకేశ్ బందార్లపల్లెకు చేరుకుని విజయశేఖర రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు విషయంలో హిందూజా తల్లిదండ్రులు, బంధువులు, విజయశేఖర రెడ్డి బంధువుల మధ్య అభిప్రాయబేధాలు తలెత్తడంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్ ఆదివారం సాయంత్రం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేశారు. హిందూజా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

పలమనేరుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కోపంతో అల్లుడే తమ కూతురిని హత్య చేసి ఉంటాడని హిందూజా తల్లిదండ్రులు జీవనజ్యోతి, లోకనాథరెడ్డి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తమ కుమార్తె, అల్లుడి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని, భర్త మారుతాడన్న నమ్మకంతో హిందూజా ఉండేదని, చివరకు అతని చేతిలోనే కడతేరిపోయిందని విచారం వ్యక్తం చేశారు. హిందూజా పిల్లలకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సాగుకు విరామం..'పాడి'కి శ్రీకారం


చక్రాయపేట మండలంలోని పాడిపశువులు


బీళ్లుగా మారిన పంటపొలాలు

చక్రాయపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు తదితర కారణాలతో ఏటేటా నష్టాలబారిన పడుతున్న రైతు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నాడు. సాగునీటి వనరులేవీ లేకపోవడంతో చక్రాయపేట మండలంలో కేవలం వర్షంపైనే ఆధారపడి వేరుశనగ, వరి, మామిడి పంటలు సాగు చేస్తారు. గతంలో వేరుశనగ, కంది,ఉలవ,సజ్జ, జొన్నలాంటి పంటలు దాదాపు 2000 హెక్టార్లలో సాగు చేసేవారు. ఏటేటా నష్టాల కారణంగా ప్రస్తుతం ఒక్కరు కూడా ఆయా పంటలు సాగు చేయడం లేదు. రెండు బర్రెలను పట్టుకున్న బతకవచ్చని నిర్ణయానికి వచ్చి పాడి వ్యాపారం మొదలుపెట్టారు. ప్రస్తుతం మండలంలో ప్రతిరోజు దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటికి అనుగుణంగా మండల కేంద్రంలో రెండు సంస్థలు పాల సేకరణ కేంద్రాలు పెట్టాయి వీటికి ప్రతి రోజూ 3,500 లీటర్ల దాకా పాలు వస్తున్నట్లు సమాచారం ప్రస్తుతం బర్రె పాలకు లీటర్‌కు రూ.83 నుంచి రూ.85 వరకూ చెల్లిస్తున్నారు. ఆవుపాలకు రూ.35 ఇస్తున్నట్లు తెలిసింది. రోజుకు ఒక బర్రె మూడు లీటర్లు ఇచ్చిన నెలకు 90 లీటర్ల పాల ఉత్పత్తి ఉంటుంది. దీంతో దాదాపు రూ.10వేల ఆదాయం లభిస్తోంది..

ఖర్చు ఎక్కువ ఆదాయం తక్కువ



రైతు పరిస్థితి నానాటికి కష్టతరం అవుతోంది. బతకడం భారమై పోతోంది. వర్షాలు లేవు, పంటలు రావు, పంటతో వచ్చిన ఆదాయం కన్నా ఆ పంటల కోసం చేసిన అప్పులు ఎక్కువ అవుతున్నాయి. దీనితో వ్యవసాయం చాలించి, మూడు బర్రెలను పెట్టుకొని డెయిరీకి పాలుపోసి జీవనం సాగిస్తున్నాం. ప నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలు ఆదాయం వస్తోంది. మరో రెండు బర్రెలను కొనుక్కోవాలని అనుకుంటున్నాం.

- దయ్యం నాగేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లె

మానసిక క్షోభకు గురిచేశారని ఫిర్యాదు

● వైసీపీ సర్పంచ్ కుటుంబంపై కేసు నమోదు

ముద్దనూరు జూన్29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గ్రామ సర్పంచ్ అరుణమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం తనపై అసభ్య పదజాలంతో కూడిన కరపత్రాలు పంచారని బీజేపీ నాయకుడు మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు .కొత్తపల్లెకు చెందిన మోహన్‌రెడ్డిపై అసభ్యకర పదాలు ముద్రించిన కరపత్రాలను గ్రామంలో విచ్చలవిడిగా వెదజల్లారు. వాటిలో మోహన్‌రెడ్డి తో పాటు అతని తల్లిని కూడా దూషించారు. మోహన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిపై కూడా దాడి చేశారు. దీంతో మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ అరుణమ్మ, భర్త రామిరెడ్డి, కుమారుడు లక్ష్మిరెడ్డి మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

సిద్దవటం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనుమలోపల్లె ఫారెస్ట్ బీట్‌లో ఆదివారం సిద్దవటం పోలీసులు తనిఖీలు చేశారు.. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు శివప్రసాద్, రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత

వాల్మీకిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో చెట్లు అక్రమంగా నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజర్వాయర్ కోసం ప్రభుత్వానికి భూములు అప్పగించి నష్టపరిహారం పొందిన కొందరు వ్యక్తులు, ఆ భూముల్లోని అల్లనేరేడు, కొబ్బరి ఫలసాయాన్ని విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతంలో ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కళాంజలిఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు

రాజంపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు ఆకాశవాణి, సంగీత విద్వాంసుడు గుణకల సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విద్వాంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతిదేవి, ఎస్.రాధిక, పలు ప్రాంతాల నుంచి వచ్చిన గాయని గాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానం

వేంపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె గండిరోడ్డులోని మదర్‌థెరిస్సా అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన అహ్మద్ జోహన్ పుట్టినరోజు సందర్భంగా ఈ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా... ఉల్లి రైతు పంట పండేనా..?

- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి
- దళారులతో మోసపోతున్న రైతులు



నాగాయపల్లె వద్ద సాగు చేసిన ఉల్లి

పెండ్లిమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఏడాది ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆరుగాలం కష్టించి సాగు చేస్తున్న ఉల్లి రైతుల పంట పండుతుందా లేదా అనేది ఇంకొన్ని రోజులు ఉండాలి.వ్యవసాయ జూదంలో ప్రతి ఏడాది రైతు ఏదో ఒక రూపంలో నష్టపోతూనే ఉన్నాడు.ఈ సారైనా ఉల్లి పంట మంచి దిగుబడి వచ్చి రైతులకు ఊరటనిస్తుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.నీటి వసతి ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఈ ఉల్లిని సాగు చేస్తారు. చౌడు,క్షారత్వం,నీరు నిల్వ ఉన్న ఉండే నేలలు ఉల్లి సాగుకు పనికి రావు. జిల్లాలో పండే కేపీ ఉల్లి(కృష్ణాపురం ఉల్లి)దేశంలోనే పేరెన్నిక ఉన్న పంట.ఇది అంతర్జాతీయంగా ఎగుమతి అయ్యే ఉల్లి పంట రకం.మండల పరిధిలోని నల్లయ్యగారిపల్లె, బాలయ్య గారిపల్లె, గొందిపల్లె, చీమలపెంట,గిరియంపల్లె,నాగాయపల్లె తదితర గ్రామాల రైతులు ఎక్కువ గా పెద్ద బళ్లారి రకం ఉల్లి పంటను 1000 ఎకరాల పైబడి పండిస్తారు.ఉల్లి సాగుకు ఎకరాకు 15 శేర్లు ఉల్లి విత్తనాలు అవసరం వీటిని కర్నూలు, మైదు కూరు పట్టణాల నుండి శేరు రూ.1100లు పెట్టి కొనుగోలు చేస్తారు.విత్తనశుద్ధితో ప్రారంభమై సేద్యం,పురుగుల మందులు,ఎరువులు,కలుపు తీయుటకు కలిపి ఎకరానికి దాదాపు రూ.80 వేల ను రైతు ఖర్చు అవుతుంది. తెగుళ్లు, చీడపీడ లను,ప్రకృతి విపత్తులను తట్టుకొని బాగా పండితే ఎకరానికి 12 టన్నులు దిగుబడి వస్తుంది. కనీసం కిలో రూ.30 అమ్మితే ఉల్లి రైతుల పంట పండినట్లే.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఉల్లి పంటను సాగు చేస్తున్నాం.ఈ ఏడాది కూడా 8 ఎకరాల్లో పంట వేశాను.దాదాపు పది లక్షలు పెట్టుబడి అయినది.ఏదో ఒక రూపంలో నష్టపోతూనే ఉన్నాం. ప్రభుత్వాలేమో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని చెబుతున్నాయి కానీ ఎక్కడా ఆచరణకు నోచుకోవడం లేదు.ధరలతో నిమిత్తం లేకుండా ప్రతి ఏడాది రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

కొండారెడ్డి, రైతు, నల్లయ్యగారిపల్లె

దళారులతో మోసపోతున్నాం



కష్టపడి పండించిన పంట ను అమ్ముకోలేక దళారుల చేతుల్లో మోసపో తున్నాం. దరలు లేనప్పుడు ఉల్లి గడ్డలను నిలువ చేసుకోనేం దుకు మన ప్రాంతంలో సౌకర్యంలేదు. వేర్ హౌసింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి.

జయచంద్రారెడ్డి,రైతు, నాగాయపల్లె

రవికుమార్ సేవలు అమోఘం



గోవిందు రవికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కడప,కలెక్టరేట్,జూన్ 29,(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రం ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడుగా సుదీర్ఘకాలం ఉద్యోగుల సంక్షేమానికి అంకిత భావంతో కృషి చేసిన ఏపీ అమరావతి ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గోవిందు రవికుమార్ సేవలు మరువ లేనివని మాజీ రాష్ట్ర డైరెక్టర్ నాగార్జున రెడ్డి కొనియాడారు. ఆదివారం ఉద్యోగ పదవీ వరమణ సందర్భంగా కలెక్టరేట్ లోని సభా భవనంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి రమేష్‌కుమార్, ట్రెజరీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజకుమార్ తదితరతెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘనేతలు పాల్గొన్నారు. అనంతరం రవికుమార్, ఆయన సతీమణి డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మను ఘనంగా సన్మాంచారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజకుమార్, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సురేష్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

కడప ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జనవిజ్ఞానవేదిక జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జాతీయ అధ్యక్షుడు బి.విశ్వనాథ మాట్లాడుతూ జూలై 12, 13 తేదీలలో కడపలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సమాచార కార్యదర్శి పి.సలావుల్లా, జిల్లా నాయకులు కె.సురేశ్‌బాబు, సుధాకర్, ఇలియాస్ బాష, వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రజాకవి వేమన

కడప కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వేమన ప్రజాకవి అని తెలుగుభాషా సేవకులు రమేష్ (శ్రీకాళహస్తి) కొనియాడారు. వైవీయూ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 144వ సదస్సు జరిగింది. ఇందులో సజీవ సంప్రదాయంగా వేమన అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వేమన పద్యం ఏ భాషకూ లేనంత గొప్పతనాన్ని తెలుగు భాషకు కలిగించిందన్నారు. కార్యక్రమంలో వైవీయూ విశ్రాంత ఆచార్యులు జి. శివారెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'జనాభా పెరగాలనడం అనాలోచితం'

వేంపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే దేశంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత,పేదరికం తాండవిస్తున్న పరిస్థితుల్లో ఇంకా జనాభా పెరగాలనడం అనాలోచితమని ఏపీసీసీ ము ఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. 144కోట్ల జనాభాతో ప్రపంచంలో మొదటిస్థానంలో భారత్ ఉందన్నారు. ఆకలి సూచిలో ప్రపంచంలో 101వ స్థానం, ప్రపంచ సంతోష సూచికలో 144వ స్థానంలో మన దేశంఉందన్నారు. ఎక్కువమంది పిల్లల్నికనండి జనాభా పెరగాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం శోచనీయమన్నారు.

కడప టూటౌన్ సీఐ బదిలీ

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కడప టూటౌన్ పోలీసుస్టేషన్ సీఐగా పనిచేస్తున్న నాగార్జున కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల కాలంలో గంజాయికి సంబంధించి ఓ నిందితుడు లాకప్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై విచారించి బదిలీ అయ్యారా లేక ఇతర కారణాల వల్ల బదిలీ అయ్యాడా అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం టూటౌన్ సీఐగా ఎవరినీ నియమించలేదు.

పాడి ద్వారా మంచి ఆదాయం

చెన్నూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పాడి ద్వారా మంచి ఆదాయం సంపాదించవచ్చనిమండల కన్వీనరు కె.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో ఆదివారం రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. సహాయ సంచాలకుడు డాక్టర్ పాండురంగారెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మధుసూధన్, టీడీపీ నేతలు,మోహన్‌రెడ్డి,ఆర్.సుధాకరరెడ్డి,సంజీవ్‌పవన్ పాల్గొన్నారు.

సమ సమాజం యువతతోనే సాధ్యం

కమలాపురం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :సమ సమాజ నిర్మాణం యువతతోనే సాధ్యమని ముఫ్తి అహ్మదుల్లా నిస్సార్‌సాబ్, ముఫ్తి అబ్దుల్‌హాదీ అన్నారు. ఆదివారం స్థానిక కుమ్మరవీధిలోని మద్రసా ఏ షహమీరియా తాలిముల్ ఖురాన్ నాల్గవ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు మదరసా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం లో షహమీరియా సంస్థ ప్రతినిధులు ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ జాహిద్‌హుస్సేన్, ఇమాంలు పాల్గొన్నారు.

కార్యకర్తల ఉపాధి కోసమే అడుగుతున్నాం

ఎవరినీ బెదిరించలేదు : టీడీపీ

వేంపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఉన్న మెస్‌లకు అనుమతి గడువు పూర్తయిందని, స్థానికంగా ఉంటున్న తమ కార్యకర్తలు ఉపాధి కోసం మెస్‌లను అడుగుతున్నాం, ఏ ఒక్కరినీ బెదరించలేదని టీడీపీమండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీసీపుటేజీ బయటకు రావడంపై ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ రంగారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా మెస్‌లలో వేరే రాష్ట్రాల వారు పనిచేసున్నారని, మా ప్రభుత్వం వచ్చింది, మా కార్యకర్తలు పనిచేసుకుంటే బాగుపడారనే ఉద్దేశంతో అడుగుతున్నామన్నారు. మా అధిష్టానం, అధికారులు దీనిని సానుకూల దృక్పథంలో చూసి ఇక్కడి కార్యకర్తలకే ఉపాధి దొరికేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడ కూడా ఎవరినీ బెదిరించే ప్రయత్నం చేయలేదని తెలిపారు. టీడీపీమైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భద్ర, నామా వేమకుమార్, తక్కళ్ల షరీఫ్, కుమ్మరాంపల్లె రెడ్డయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మానవత కృషిచేయాలి

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో నైతిక వలువలు పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు మానవత సంస్థ కృషిచేయాలని మాజీ జడ్పీటీసీపోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రిటైర్డ్ ఎంఈఓ సదాశివరెడ్డి అధ్యక్షతన ఆదివారం మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం, 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతుల పురస్కార కార్యక్రమాలు నిర్వహించారు. పదిలో ఉత్తమ ప్రతిభచూపిన విద్యార్థులకు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నగదు బహుమతులు అందించారు. ఎస్‌సీఎస్‌ఆర్ అధినేత సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ జస్మిత, అధ్యక్ష కార్యదర్శులు జయరాజు, గంగిరెడ్డి,జిల్లా కౌన్సిల్ రీజియన్ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణకు విధిగా హాజరుకావాలి

పులివెందుల రూరల్,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శిక్షణకు మహిళా సర్పంచులు విధిగా హాజరుకావాలని కోర్స్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగే రెండో విడతగా నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె, చక్రాయపేట, వీరపునాయునిపల్లె మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచులకు ఈ శిక్షణ ఎంపీడీఓ సభాభవనంలో నిర్వహిస్తామన్నారు. తప్పక హాజరు కావలని ఆయన కోరారు.

350 మందికి వైద్యపరీక్షలు

పోరుమామిళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 350 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి గుండె, షుగరువ్యాధి నిపుణుల చే వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ రాధాక్రిష్ణమూర్తి, క్లబ్ ప్రెసిడెంటు శివకుమార్, గంగిశెట్టి పవన్‌కుమార్, రేవతి, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కాకుమాని క్రిష్ణవేణి, అమ్మన్ని, గంగిశెట్టి సీతాకుమారి, విశ్వనాథుల ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కాశినాయన జూన్29(ఆంధ్రజ్యోతి):ఇటుకులపాడు లో నూతన శివాలయ ప్రతిష్ఠ జరిగి 41 రోజుల సందర్భంగా ఆదివారం గ్రామస్థులు గ్రామదేవత అయిన పోలేరమ్మకు సాంప్రదాయబద్ధంగా పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమానికి బద్వేల్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి పాల్గొనగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరుణుడి కోసం రైతన్న చూపు


మొక్కజొన్న సాగులో రైతులు


వరినాట్ల కోసం నారుకయ్యలు సిద్ధం చేసిన దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వర్షాలు కురవకపోవడంతో రైతున్నలు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. మే నెలలో కురిసిన వర్షాలు ప్రస్తుత జూన్ నెలలో మొఖం చాటేయడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే విత్తనం విత్తడానికి సంసిద్ధంగా ఉన్న రైతన్న ఎప్పుడు వర్షం వస్తుంది.. ఎప్పుడు విత్తనం విత్తాలంటూ దీర్ఘాలోచనలో పడ్డారు. జమ్మలమడుగు మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలాల్లో పంట సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేశారు. మరికొందరు కంపచెట్లు, ఇతర వ్యర్థాలు తొలగించి శుభ్రం చేస్తున్నారు. మరికొందరు రైతులు ఇప్పటికే వరిసాగు చేయడానికి నారు సిద్ధం చేసుకున్నారు. మండలంలోని ధర్మాపురం, గొరిగెనూరు, సలివెందుల, పెద్దదండ్లూరు, దేవగుడి, పి.బొమ్మేపల్లె, అంబవరం, పి.సుగుమంచిపల్లె గ్రామాల్లో రైతులు వరి అధికంగా సాగు చేస్తారు. ఈసారి రుతుపవనాలు ముందుగా వచ్చినప్పటికి జూన్ నెలలో మందగించి వర్షం కురవలేదు. దీంతో పంట సాగు చేయడానికి వర్షం కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. కనీసం బోర్లు, బావుల కింద పంటలు సాగు చేద్దామన్న వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే వరికి తగినమేర నీరందించలేక నష్టపోవాల్సి వస్తుందేమోనని మదనపడుతున్నారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట సాగు చేయడానికి పెట్టుబడి సాయం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల వద్ద నుంచి సిద్ధంగా పెట్టినప్పటికి కొందరు రైతులకు డబ్బులు లేక వ్యవసాయంవైపు మక్కువ చూపకుండా ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఎరువులు, విత్తనాల వ్యాపారులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వాటిపై విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

5న మెగా లోక్ అదాలత్

దువ్వూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో జూలై 5వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాధితులు లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

మాలమహానాడు అధ్యక్షురాలికి సన్మానం

పోరుమామిళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జాతీయ అధ్యక్షురాలు నాగమల్లీశ్వరికి పోరుమామిళ్లలో హ్యూమన్ రైట్స్ కార్యదర్శి ముత్యాల ప్రసాద్, చాటకొండు విజయ్‌లు సన్మానించారు. ఆదివారం ఆమె పోరుమా మిళ్లకు విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినం

పోరుమామిళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పోరుమామిళ్లలో ఘనంగా జరుపుకుందామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జ్ నరసింహులు, కోకన్వీనరు నాగిపోగు మనోజ్ సాగర్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవం జూలై 7న జరగనున్నదని వారు తెలిపారు.

వేడుకగా ఏరువాక గంగమ్మ తల్లి ఉత్సవాలు


పల్లకీ ఊరేగింపులో అమ్మవారు

ఎర్రగుంట్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో వెలసిన ఏరువాక గంగమ్మ తల్లి 28వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, కలశస్థాపన, గణపతి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు విశేష సంఖ్యలో వచ్చి అమ్మవారిని మొక్కుకున్నారు. మధ్యాహ్నం సుమారు 7వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఆలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు సాగింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం అందరిని అలరించింది. అమ్మవారి వేషధారణలో చేసిన నాట్యం అందరిని మంత్రముగ్ధులని చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ ఛైర్మన్ సన్నపురెడ్డిసూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా చేశారు.

అంబేడ్కర్ గురుకులాన్ని విలీనంచేస్తే ఉద్యమమే


గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె మహాగురుకులంలో కందిమల్లాయపల్లెలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను విలీనం చేయాలని చూస్తే ఉద్యమిస్తామని సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మఠంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సీపీఐ మండలకార్యదర్శి పెదుళ్లపల్లె ప్రభాకర్, సీపీఎం మండల కార్యదర్శి సునీల్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో ఏర్పాటైన అంబేడ్కర్ గురు కులాన్ని తరలించాలని ముందు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారా? అని ప్రశ్నించడంతోపాటు విద్యాకమిటీ సమావేశం నిర్వహించి తీర్మానాలు చేశారా? అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్య దర్శులు సోమిరెడ్డిపల్లె నారాయణ, చేజర్ల రవి, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఓబన్న, విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలుపాటించాలి

కలసపాడు,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వాహనదారులకు ఎస్ఐ తిమోతి సూచించారు. ఆదివారం శంఖవరం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనపత్రాలు చూపించకపోవడం, ట్రిపుల్‌రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ లేకపోయిన, మైనర్‌లు వాహనం నడిపిన చర్యలు తప్పవన్నారు.

మహాన్యూస్ కార్యాలయంపై దాడి దారుణం

బద్వేలుటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదులోని మహాన్యూస్ కార్యాలయంపై దాడి దారుణమని ఖండిస్తూ ఆదివారం పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దాడిని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీ యూడబ్ల్యూజె అండ్ ఏపీజేఎఫ్ జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

ఖాజీపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో దుంపలగట్టు కార్యదర్శిగా పనిచేస్తున్న బుడెన్‌సాబ్ పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేసి ఆయనకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

మైదుకూరు రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న అనే యువకుడు రాధ అనే మహిళకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించాడు. స్థానిక పాతూరులోని రామాలయం వీధిలో నివసిస్తున్న రాధఅనే మహిళ నెల రోజుల క్రితం కింద పడి వెన్నుముక దెబ్బతిని చికిత్స పొందుతోంది. ఆమెకు భర్త లేడు, ఒక కుమారుడు చదువుకొంటున్నాడు. దీనిపై స్పందించిన యాపారాల చిన్న ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెంకటరమణ,బండి అమర్‌నాథ్,సారథి పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ నాయబ్ రసూల్‌కు సన్మానం

చాపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కన్నెలూరు నాయబ్‌రసూల్‌ను ప్రజా సేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అక్బర్‌వలి, రజనీకాంత్, రామమోహన్, అక్బర్‌సలీం, నారాయణరెడ్డి సన్మానించారు. ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో ఆర్‌టీడీ కళాశాల విద్యార్థుల విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో రాణీతిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. బీఎస్సీ బయోటెక్నాలజీ తృతీయ సంవత్సరంలో రోషన్, స్రవంతి, మూడవ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సువర్ణ, ఫైజా, మూడవ సంవత్సరం బీకాం కంప్యూటర్స్‌లో చంద్రకళ, రోష్నమౌరిన్‌లో 10కి 10 జీపీఏ సాధించారని తెలిపారు. 4వ సెమిస్టర్ బీఎస్సీ బయోటెక్నాలజీలో వైష్ణవి 10కి 10, షరీనామహబూబ్ 9.85, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో భార్గవి 9.45, అశ్విని 9.3, బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో గౌషియా 9.2, చౌడేశ్వరి 9.1 జీపీఏ సాధించారు. రెండవ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో శైలజ 9.25, హర్షిత 9.42, బయోటెక్నాలజీలో లావణ్య, స్నేహలు 9.25, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో రాణి 9.42, రాహిన్ 9.17 జీపీఏ సాధించారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏడుగురు 10కి 10 జీపీఏ సాధించారని కరస్పాండెంట్ హరినారాయణ తెలిపారు. 4వ సెమిస్టర్ జువాలజీలో తేజశ్విని, మాధవి, లక్ష్మి, లాలస, మంజులత 10 జీపీఏ, తస్లిమా, చందన 9.7 జీపీఏ సాధించారు. బయో టెక్నాలజీలో జ్ఞానశ్రీ 10, తన్మయ 9.7, శ్రావణిపర్హా 9.55, డీసీఏలో హర్షిత 9.65, ఆయేషా 9.25, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో లక్ష్మిప్రసన్న 9.65, శ్రీప్రియ 9.15, బీకాం కంప్యూటర్స్‌లో హసీనా 9.30, పరిమళ 9.10, రెండవ సెమిస్టర్ జువాలజీలో సబీనాముస్కాన్ 10, గౌషియా, సుప్రియ 9.75, బయోటెక్నాలజీలో బ్లెజీనా 9.56, కంప్యూటర్ సైన్స్‌లో దీవెన, నాగరచన 8.92, బీసీఏలో నాగశ్వేత 8.92, గంగ హరిత 8.75, బీబీఏలో లక్ష్మిప్రవల్లిక 9.33, బీకాం కంప్యూటర్స్‌లో హారిక 9.8, సాయివైష్ణవి 8.83 జీపీఏ సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్ పృద్వీనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ఎస్‌కేఎస్‌సీ విద్యార్థుల సంచలనం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో ఎస్‌కేఎస్‌సీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బయోటెక్నాలజీలో వాణి, సుప్రజ 9.75, బీకాం కంప్యూటర్స్‌లో ఫర్హానా 9.67, బీఏ హిస్టరీలో కుషియాదవ్ 9.67, కరిముల్లా 9.67, బీఎస్సీ కంప్యూటర్‌లో దిల్‌షాద్ 9.50, ముస్కిన్ 9.42, బీఏ హిస్టరీలో ముస్తఫా 9.33 జీపీఏ సాధించారు. నాలుగవ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్‌లో మౌనిక 9.15, బయో టెక్నాలజీలో మల్లికార్జున 9.10, బీఏ హిస్టరీలో బషీరూన్, అంజలి 8.80, శ్రావణి 8.60, బీఎస్సీ కంప్యూటర్స్‌లో అణిత 8.75 జీపీఏ సాధించారు. ఉత్తమ మార్కులుసాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ శనివారం ప్రకటించిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. 4వ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్స్‌లో మల్లీశ్వరి 10కి 9.8, సాహిన్, దస్తగిరి 9.4 జీపీఏ సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో జుజేరియా 9.45, పల్లవి 9.35, ఆయేషా 9.25 జీపీఏ సాధించారు. రెండవ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్స్‌లో గురుపల్లవి 9.25, బీకాం కంప్యూటర్స్‌లో కరిష్మా 9.42, కుందన 9.8 జీపీఏ సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపండి

బద్వేలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆదివారం సీపీఎం నాయకులు ఇంటింటికి పోస్టర్లను అంటించారు. విద్యుత్ చార్జీల పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, లోకేశ్ తన పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగులకొట్టాలని ఇచ్చిన నినాదం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. తక్షణమే ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయడంతోపాటు స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, షేక్ మస్తాన్, ఆదిల్ , ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.













